క్లుప్తంగా

అసాంఘిక కార్యక్రమాలపై కఠిన చర్యలు


ఎస్సై ఆర్.శివాజీ

దెందులూరు: దెందులూరు మండలంలో పేకాట, కోడిపందేలు, ఇతర అసాంఘిక కార్యక్రమాలు నిర్వహిస్తే వారిపై ఉక్కు పాదం మోపుతామని నూతనంగా బాధ్యతలు చేపట్టిన ఆర్.శివాజీ అన్నారు. ఆదివారం దెందు లూరు పోలీస్ స్టేషన్‌లో ఆయన మాట్లాడుతూ పాత నేరస్తులు అనుమానితులు, కోడిపందేలు, పేకాట నిర్వాహకులపై ఇప్పటికే నిఘా ఉందన్నారు. అసాంఘిక కార్యక్రమాలపై 9440796654 నంబర్‌కు సమాచారాన్ని అందించాలన్నారు. సమాచారం ఇచ్చినవారి వివ రాలు గోప్యంగా ఉంచుతామని దెందులూరు మండలం పూర్తిస్థాయిలో శాంతిభద్రతల అమలుకు తమ వంతు బాధ్యత మండల ప్రజలందరూ అందించాలని ఎస్సై ఆర్‌శివాజీ కోరారు.

కనకదుర్గమ్మకు పూజలు


అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు

దెందులూరు: మేధనరావుపాలెంలో దసరా మహోత్సవాలు భక్తిశ్రద్ధలతో వైభవంగా నిర్వహించారు. కనకదుర్గమ్మ తల్లి ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ప్రజాప్రతినిధులు, మాజీ ప్రజా ప్రతినిధులు కమిటీ సభ్యులు భక్తులు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అన్నదానం చేశారు.

గోపన్నపాలెంలో సాయిబాబా బ్రహ్మోత్సవం


సాయిబాబా భక్తుల ఊరేగింపు

దెందులూరు: సానిగూడెం గ్రామ పంచాయతీ పరిధిలోని సాయి వృద్ధాశ్రమం సాయిబాబా ఆలయం పరిధిలో గోపన్నపాలెం, గాలాయగూడెంలో సాయిబాబా ఊరేగింపు, బ్రహ్మోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు సాయిబాబా భక్తులు స్వామివారి దర్శించుకుని ఊరేగింపులో పాల్గొన్నారు.

కార్యకర్తలకు అండగా ఉంటాం



నాగరాజు కుటుంబానికి సాయం అందజేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

దెందులూరు: గాలాయగూడెంలో ఎస్సీ ఏరియాకు చెందిన వైఎస్సార్‌సీపీ కార్యకర్త దర్శనపు నాగరాజు ఇటీవల మృతి చెందగా వారి కుటుంబానికి పార్టీ తరఫున యువ నాయకులు సాయం అందించారు. ఆదివారం మాజీ ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి, మండల పార్టీ అధ్యక్షుడు కామిరెడ్డి నాని, జెడ్పీటీసీ నిట్టా లీలానవకాంతం ఆదేశాల మేరకు నాగరాజు కుటుంబానికి నిత్యావసర సరుకులు అందించారు. పార్టీ కార్యకర్తలకు, వారి కుటుంబాలకు అండగా ఉంటామని వారన్నారు.

అమ్మవారికి వెండి వీణ సమర్పణ

పెదపాడు: అమ్మవారికి వెండి వీణను వట్లూరుకు చెందిన గొర్రెల లక్ష్మణరావు బేబీ అనురాధ దంపతులు సమర్పించారు. వట్లూరు నెహ్రూ నగర్ కాలనీలోని దుర్గా మల్లేశ్వర స్వామికి రూ.1,16,500 విలువైన వెండి వీణను అమ్మవారికి సమర్పించారు. దుర్గామల్లేశ్వరస్వామిపై ఉన్న విశ్వాసంతోనే వెండి వీణ అందించామని లక్ష్మణరావు దంపతులు తెలిపారు.

చర్చి నిర్మాణానికి హర్షవర్ధన్ విరాళం


చర్చి నిర్మాణానికి విరాళం అందజేస్తున్న హర్షవర్ధన్

దెందులూరు: దెందులూరులో నూతనంగా నిర్మిస్తున్న సాల్వేషన్ ఆర్మీ చర్చి నిర్మాణానికి తెలంగాణ హ్యూమన్ రైట్స్ డైరెక్టర్ పల్లె హర్షవర్ధన్ కుటుంబ సభ్యులు రూ. 30 వేలు నగదును ఆదివారం అందజేశారు. కోర్ ఆఫీసర్ మేజర్ రమణయ్య, రిటైర్డ్ టీసీ జోషి, సంఘ సభ్యులు కొంగర కిరణ్‌కు హర్షవర్ధన్ నగదును అందజేశారు. ఈ సందర్భంగా దాతను పలువురు అభినందించారు.

చిరుద్యోగులపై బాబు మార్క్ రాజకీయం

- యువత జీవితాలతో చెలగాటం
- ఉపాధికి గండి కొడుతున్న చంద్రబాబు
- ఇప్పటికే వలంటీర్ల తొలగింపు
- రేపటితో ప్రభుత్వ మద్యం దుకాణాలకు స్వస్తి
- 16వ తేదీ నుంచి ప్రైవేటు షాపుల్లో మద్యం విక్రయాలు
- నియోజకవర్గంలో రోడ్డున పడనున్న 88 మంది చిరుద్యోగులు



మూత పడనున్న అడవికొలను ప్రభుత్వ మద్యం దుకాణం

నిడమర్రు: బాబు వస్తే జాబు వస్తుందంటూ గడచిన సార్వత్రిక ఎన్నికల్లో ఊదరగొట్టిన కూటమి నేతలు. నేడు గద్దెనెక్కాక అందుకు పూర్తిభిన్నంగా వ్యవహరిస్తున్నారు. ఇప్పటికే గ్రామ, వార్డు వలంటీర్లు కొనసాగింపు అంశం అగమ్యగోచరంగా ఉంటే.. తాజాగా ప్రభుత్వం మద్యం దుకాణాల్లో పనిచేసే ఉద్యోగులను తొలగించేందుకు రంగం సిద్ధం చేసింది.ఉంగుటూరు నియోజకవర్గంలో 20మద్యం దుకాణాలతోపాటు భీమడోలు, గణపవరంలో మొత్తం రెండు వైన్ మాల్స్‌ను ఇప్పటి వరకూ ప్రభుత్వం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నారు. వీటిలో మొత్తం 88 మంది ఉద్యోగులు సేవలందిస్తున్నారు. తాజాగా ప్రభుత్వం తీసుకువచ్చిన కొత్త మద్యం పాలసీతో ఆయా కుటుంబాలు రోడ్డునపడనున్నాయి. ప్రభుత్వం తీసుకొచ్చిన మద్యం పాలసీకి మీము వ్యతిరేకంకాదని, ఎటువంటి ప్రత్యామ్నాయ ఉపాధి మార్గాలు చూపకుండా తొలగించడం అన్యాయమంటూ వారంతా వాపోతున్నారు. ప్రభుత్వం మా కుటుంబాల పరిస్థితిని పరిగణలోకి తీసుకుని తగిన న్యాయం చేయాలంటూ వారంతా ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

16వ తేదీ నుంచి ప్రైవేటు మద్యం షాపులు

గత ప్రభుత్వం నుంచి అమలవుతున్న ప్రభుత్వ మద్యం దుకాణాలు ఈనెల 15వ తేదీన మూత పడనున్నాయి. ఈ మేరకు ఆయా దుకాణాలకు కొత్తగా ఎటువంటి మద్యం సరుకు ఇవ్వడంలేదు. ఇప్పటి వరకూ ఉన్న మద్యం నిల్వలు విక్రయించేలా అధికారులు చర్యలు తీసుకున్నారు. 200 కేసుల కంటే తక్కువ ఉంటేనే కొత్త స్టాక్ పంపించారు. 14న ప్రైవేటు మద్యం విక్రయాల నిర్వహణకు లైసెన్స్‌ల జారీ ప్రక్రియ పూర్తి చేయనున్నారు. 15తో ప్రభుత్వ మద్యం అమ్మకాలకు స్వస్తి పలకనున్నారు. 16వ తేదీ నుంచి కొత్తగా లైసెన్స్ పొందిన వారు వారికి కేటాయించిన మండలాల్లో షాపులు తెరవనున్నారు. నియోజకవర్గంలో వైన్‌మాల్స్‌తో కలుపుకుని మొత్తం 22 ప్రభుత్వ మద్యం దుకాణాలున్నాయి. వీటిలో 22 మంది సూపర్ వైజర్లు, 44 మంది సేల్స్‌మెన్లు, 22 మంది వాచ్‌మెన్లు ఉన్నారు. ప్రావిడెంట్ ఫండ్ కటింగ్ పోను నెలకు సూపవర్ వైజర్లకు రూ.19.500, సేల్స్‌మెన్స్‌కు రూ.16,500, వాచ్‌మెన్‌కు రూ.10 వేల జీతం ఇస్తున్నారు.

జిల్లా సెలెక్షన్ కమిటీ ద్వారా ఎంపిక

వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో 2019 జిల్లా సెలెక్షన్ కమిటీ ద్వారా ఎంపికై నియామక పత్రాలు అందుకుని వివిధ హోదాల్లో మద్యం దుకాణాల్లో యువత ఉద్యోగ బాధ్యతలు నిర్వహిస్తున్నారు. గత ప్రభుత్వంలో ఉద్యోగాలు పొందినవారు ఎంతో ఆనందపడ్డారు. ప్రభుత్వం మారిన తర్వాత వీరి తలరాత కూడా మారిపోయింది. వైఎస్సార్ సీపీ హయాంలో ఇచ్చిన చిరు ఉద్యోగాలను తొలగించడమే పనిగా పెట్టుకున్న కూటమి ప్రభుత్వం వీరి జీవితాలతో చెలగాటమాడుతోంది. సెబ్ (స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో విభాగం) ఇప్పటికే ప్రభుత్వం రద్దు చేసింది. సొంతశాఖ అయిన ఎక్సైజ్‌కు ఆ సిబ్బందిని బదిలీ చేసింది. ఈ నెల నుంచి కూటమి ప్రభుత్వం తీసుకువచ్చిన కొత్త మద్యం పాలసీ అమలు కావడంతో ఇప్పటికే ప్రైవేటు వ్యక్తులకు మద్యం దుకాణాల అమ్మకాలనే అప్పగించేలా ప్రభుత్వం చర్యలు చేపట్టింది.

నియోజకవర్గంలో ఇలా..

మండలం	ప్రభుత్వ దుకాణాలు	ఉపాధి కోల్పోయే ఉద్యోగులు
గణపవరం	05	20
నిడమర్రు	03	12
భీమడోలు	07	28
ఉంగుటూరు	07	28
మొత్తం	22	88

నియోజకవర్గంలో యువత ఉపాధికి గండం

కొత్త మద్యం పాలసీతో ఇప్పటివరకూ మద్యం దుకాణాల్లో పని చేస్తున్నవారు ఉపాధి కోల్పోతున్నారు. ఇప్పటికే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక నెలసరి జీతభత్యాలు సకాలంలో ఇవ్వకపోవడంతో పాటు పీఎఫ్, గ్రాడ్యూటీ వంటి సౌకర్యాలను ఉపసంహరించుకునేలా చర్యలు తీసుకోవడంతో ఆందోళన వ్యక్తం అయ్యేది. వైఎస్సార్ సీపీ హయాంలో ప్రభుత్వమే మద్యం షాపులను ఏర్పాటు చేసి నిరుద్యోగులకు ఉపాధిని కల్పించి జీవనోపాధిని కల్పించింది. గత ఐదేళ్ల పాలనలో ఎటువంటి సమస్యలు రాకుండా ఆ ఉద్యోగుల కుటుంబాలకు ఆసరగా నిలిచింది. నూతన కూటమి ప్రభుత్వం తమను రోడ్డున పడేయకుండా ప్రత్యామ్నాయం చూపాలని సిబ్బంది వేడుకుంటున్నారు.

ఉద్యోగ భద్రత కల్పించాలి



కొత్త మద్యం పాలసీకి మేం వ్యతిరేకం కాదు. మాకు ఉద్యోగ భద్రత కల్పించాలి. ప్రభుత్వం తీసుకున్న నిర్ణయానికి కట్టుబడి ఉంటాం.. ప్రభుత్వ మద్యం దుకాణాలలో సైపర్‌వైజర్లుగా పనిచేస్తున్న మాకు ఉద్యోగభద్రత కల్పిస్తే మా కుటుంబాలకు మేలు చేసినవారవుతారు. మెరిట్‌తో మేము ఉద్యోగాన్ని సంపాదించాము.

– జి. మురళి, సూపర్‌వైజర్, అడవికొలను

మా కుటుంబాలు రోడ్డున పడతాయి



కొత్త మద్యం పాలసీ అమలుతో ఇప్పడు అమలవుతున్న ప్రభుత్వ మద్యం దుకాణాలు మూతపడనున్నాయి. దీంతో ఉన్న ఫళంగా ఉద్యోగం నుంచి తొలగిస్తే మాతోపాటు మా కుటుంబాల రోడ్డున పడతాయి. ఐదు సంవత్సరాల పాటు ఉద్యోగం చేసిన మేము ఇప్పుడు ఒక్కసారిగా నిరుద్యోగులుగా మారుతాము. ప్రభుత్వం మా కుటుంబాలపై దృష్టిపెట్టి తగిన న్యాయం చెయ్యాలి.

– ఎస్. విజయ్‌రాం, సూపర్‌వైజర్, నిడమర్రు

చిరుద్యోగులపై చిన్నచూపు తగదు



చిరుద్యోగులపై కూటమి ప్రభుత్వానికి చిన్నచూపు తగదు. ప్రభుత్వం ద్వారా ఎంపికైన చిరుద్యోగులకు ఉద్యోగ భద్రత కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వాలదే. కొత్త మద్యం పాలసీతో వేల మంది చిరుద్యోగుల పొట్టకొట్టడం తగదు. వారందరికీ తగిన ఉపాధి మార్గాలు చూపించే వరకూ ఎక్సైజ్ శాఖలో ఉద్యోగులుగా కొనసాగించాలి.

– కోడే కాశి, జెడ్పీటీసీ, నిడమర్రు

అమ్మవార్ల ఆలయానికి రిఫ్రిజిరేటర్ వితరణ

దెందులూరు: గాలాయగూడెం గ్రామ దేవత అచ్చమ్మ పేరంటాలమ్మ తల్లి ఆలయానికి గాలాయగూడెంకు చెందిన వ్యాపారవేత్త పూజారి సర్వేశ్వరరావు, కుమారుడు పూజారి సీతారామ్ రిఫ్రిజిరేటర్ అందజేశారు. కమిటీ సభ్యులు పూజారి శ్రీనివాసరావు. పూజారి వెంకటరత్నం నాయుడు, ఏనుగు రామకృష్ణ, గంటా సుబ్బారావు, పెద్ది శెట్టి నాని, యుగంధర్ తదితర అచ్చమ్మ పేరంటాలమ్మ తల్లి ఆలయ కమిటీ సభ్యులకు దాత రిఫ్రిజిరేటర్‌ను అందజేశారు. గాలాయగూడెం గ్రామ పంచాయతీ కార్యాలయానికి రిఫ్రిజిరేటర్‌ను సర్పంచ్, పంచాయతీ కార్యదర్శికి దాత పూజారి సీతారాం అందజేశారు. ఈ సందర్భంగా గ్రామస్తులకు దాతను అభినందించారు.

నర్సింగ్ కళాశాలలో డీఎంఎల్‌టీ, జీఎన్‌ఎం కోర్సులు

దెందులూరు: దెందులూరు బీఆర్‌డీ నర్సింగ్ కళాశాలలో డీఎంఎల్‌టీ, జీఎన్ఎం కోర్సుల్లో అభ్యర్థులు ఈనెల 27వ తేదీలోపు దెందులూరులోని నర్సింగ్ కళాశాలకు వచ్చి మేనేజ్‌మెంట్ సీట్లు నిబంధనలు పాటించి ప్రవేశం పొందాలని కరస్పాండెంట్ సుగ్గిశెట్టి నూకరాజు కోరారు.

పెట్రోల్ బంకులో లక్కీడిప్

దెందులూరు: దసరా సందర్భంగా వాహనదారులను ఆకర్షించేందుకు పలు పెట్రోల్ బంకులు బహుమతులను ప్రకటించాయి. దీనిలో భాగంగా దెందులూరులోని 16నంబర్ జాతీయ రహదారి పక్కన ఉన్న కేవీ లక్ష్మీనారాయణ హెచ్‌పీ పెట్రోల్ బంక్‌లో రూ. 200 పైగా పెట్రోల్, డీజిల్ పోయించుకున్న వాహనదారులకు పలు బహుమతులు లక్కీడిప్ ద్వారా అందజేశారు. 12వతేదీన గ్రామస్తులు, వాహనదారుల సమక్షంలో పెట్రోల్ బంక్ అధినేత కె.వి లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో లక్కీ డ్రా నిర్వహించారు. ఏలూరుకు చెందిన ఎస్ లక్ష్మి, దెందులూరుకు చెందిన వాసు యాదవ్‌కు మొదటి బహుమతిగా హీరో డీలక్స్ బైక్, టి అశోక్‌కు రెండవ బహుమతి 175 లీటర్ల రిఫ్రిజిరేటర్, మూడో బహుమతి గ్రైండర్ లక్కీడిప్ ద్వారా వాహనదారులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో సంస్థ మేనేజర్ మోహన్‌రావు, సిబ్బంది పాల్గొన్నారు.

పోలీస్ శాఖ సూచనలు పాటించాలి


జాతీయ రహదారిపై భవానీ మాలధారులకు వెనుక వైపు స్టిక్కర్లు వేస్తున్న సీఐ యూజే విల్సన్

భీమడోలు: భవానీ మాలధారులు పోలీస్ శాఖ సూచనలు పాటించి సుఖ ప్రయాణంతో గమ్య స్థానాలకు చేరుకోవాలని భీమడోలు సీఐ యూజే విల్సన్ కోరారు. జిల్లా ఎస్పీ కె.శ్రీప్రతాప్ శివ కిషోర్ ఆదేశాల మేరకు సీఐ యూజే విల్సన్ ఆధ్వర్యంలో ద్వారకాతిరుమల ఎస్సై సుధీర్‌బాబు, సిబ్బంది ఆదివారం సాయంత్రం జాతీయ, రాష్ట్రీయ రహదారులపై భీమడోలు, పూళ్ల, కురెళ్లగూడెం, సాయిబాబా ఆలయం వద్ద కాలినడకన విజయవాడకు వెళ్తున్న భవానీ మాలధారులు, తిరిగి స్వగ్రామాలకు వెళ్తున్న మాలధారులకు పాటించాల్సిన నియమ నిబంధనలపై అవగాహన కల్పించారు. పలు కూడళ్లలో ఫ్లెక్సీలను ఏర్పాటు చేసి అవగాహన కల్పించారు. భవానీ భక్తులు నడుచుకుంటూ గమ్య స్థానాలకు చేరుకునే తరుణంలో ఎటువంటి ప్రమాదాలబారిన పడకుండా పోలీస్ శాఖ ప్రత్యేక దృష్టిని సారించిందన్నారు. భవానీ భక్తులు రోడ్డు ప్రమాదాల్లో మృతి చెందిన నేపథ్యంలో భవానీ మాలధారులు పోలీస్ శాఖ అధికారుల సూచనలను పాటించాలన్నారు. రాత్రి వేళల్లో కాలినడక వెళ్లే భక్తుల వెనుక భాగంలో రేడియం స్టిక్కర్లను వేసుకోవాలన్నారు. తద్వారా ప్రమాదాల నివారణ సాధ్యమవుతుందన్నారు. కాలినడకన వెళ్లే ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలన్నారు. పోలీస్‌శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

వైభవంగా శమీ పూజ

ఏలూరు (టూటౌన్): బసవేశ్వర కర్ణభక్తుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన మహర్నవమి కర్ణోద్భవుల (కర్ణభక్తుల) పుట్టిన రోజు వేడుక సందర్భంగా శమీ పూజ కార్యక్రమం స్థానిక నరసింహారావు పేటలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గౌరవ సలహాదారులైన వాసా ప్రసాదరావు పూజా కార్యక్రమం విశిష్టతను వివరించారు. సంఘం ఉపాధ్యక్షుడు శివశ్రీ అల్లం సర్వేశ్వరరావు వీరభద్ర స్వామి ఖడ్గంతో దండకం ఉచ్చరించారు. ఈ కార్యక్రమంలో పెద్దలను సత్కరించారు. తమ్మా గంగాధరరావు, అధ్యక్షుడు పొన్నా కోటేశ్వరరావు, కార్యదర్శి శలా నాగతిరుమలేశ్వరరావు, కోశాధికారి తమ్మా శ్రీనివాసరావు, కమిటీ సభ్యులు వాసా వెంకటరమణ, చల్లా నాగరాజు (నాగు) అందే ఏసు, సభ్యులు 60 మంది పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ శాంతి మార్గంలో పయనించాలి


ప్రత్యేక ప్రార్థనలు చేస్తున్న దృశ్యం

దెందులూరు: ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక చింతన కలిగి ఏసుక్రీస్తు సూచించిన శాంతి మార్గంలో ప్రతి ఒక్కరూ పయనించాలని ఏలూరు మేత్రాసన, విశాఖపట్నం అగ్రపీఠం అపోస్తలిక పాలనాధికారి ఆర్‌సీఎం ఏలూరు పీఠాధిపతి బిషప్ డాక్టర్ పొలిమేర జయరావు అన్నారు. శనివారం దెందు లూరులోని ఆర్‌సీఎం చర్చిలో శుద్ధికరణ మాత మహోత్సవాలు వైభవంగా నిర్వహించారు. దెందులూరు ఆర్‌సీఎం చర్చి విచారణకర్త రెవరెండ్ ఫాదర్ జి.అమన్ రాజా, విచారణ సహాయక గురువులు రెవరెండ్ ఫాదర్ ఆర్ బాలరాజు, రెవరెండ్ ఫాదర్ డి కళ్యాణ్ ఆధ్వర్యంలో ఏలూరు పీఠాధిపతి పొలిమేర జయరావు అధ్యక్షతన శుద్ధికరణ మాత మహోత్సవాలు నిర్వహించారు. ఏలూరు అగ్ర పీఠాధిపతి పొలిమేర జయరావు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. సర్పంచ్ తోట ఏసమ్మ యేసు దంపతులు, గ్రామస్తులు, సంఘస్తులు బిషప్ పొలిమేర జయరావును ఘనంగా సన్మానించారు.

వైభవంగా రామాలయం ప్రతిష్ఠ పూజలు


నూతనంగా ప్రతిష్ఠించిన సీతారామలక్ష్మణ, ఆంజనేయ స్వామి విగ్రహాలకు పూజలు

భీమడోలు: భీమడోలు పంచాయతీ శివారు దళిత గ్రామం ఆర్జావారిగూడెంలో ఆదివారం శ్రీసీతా రామ లక్ష్మణ, ఆంజనేయ స్వామి వార్ల విగ్రహాల ప్రతిష్ఠ మహోత్సవం వైభవంగా నిర్వహించారు. గ్రామంలోని రామాలయం పునర్నిర్మాణానికి గత ప్రభుత్వం శ్రీవాణి ట్రస్ట్ ద్వారా నిధులు మంజూరు చేసింది. ఈ తిరుమల తిరుపతి దేవస్థానం శ్రీవాణి ట్రస్ట్ ద్వారా సమరసత సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో రూ.10 లక్షలతో సర్వాంగ సుందరంగా పునః నిర్మించిన శ్రీరామాలయం ప్రతిష్ఠ కనుల వేడుకగా నిర్వహించారు. పెదవేగి మండలం ముందూరులోని బ్రహ్మచారిణి విరాజానంద శ్రీ యాజ్ఞవక్క రాజాశ్రమం పూజ్యశ్రీ కృష్ణ చరణానంద భారతీస్వామి బృందం ఆధ్వర్యంలో వేద పండితుల మంత్రోచ్ఛరణల నడుమ శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించారు. ఆశ్వీయుజ మాస శుద్ధ ఏకాదశిని పురస్కరించుకుని శ్రీరామచంద్రస్వామికి కలశ స్థాపన, పుణ్యాహవాచనం, గణపతి హోమం, నవ గ్రహ పూజలు, శ్రీరామ హోమం, పంచామృత అభిషేకాలు వైభవంగా నిర్వహించారు. ఆలయంలో శ్రీసీతారామ లక్ష్మణ, అంజనేయ స్వామి వార్ల విగ్రహాలను ప్రతిష్ఠించారు. రాష్ట్ర సమరసత సేవా ఫౌండేషన్ అధ్యక్షుడు విష్ణు, జిల్లా నాయకులు జి.సత్యనారాయణ, సర్పంచ్ పాము సునీత, జెడ్పీటీసీ తుమ్మగుంట భవానీ, ఎంపీటీసీ ముళ్లగిరి జాన్సన్, బీజేపీ జిల్లా నాయకులు జి ప్రసాదరావు తదితరులు ప్రతిష్ఠ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఆలయాన్ని సుందరంగా నిర్మించిన ఆలయ నిర్మాణ కమిటీ అధ్యక్షుడు పాము మాన్‌సింగ్‌తోపాటు సభ్యులను ఘనంగా సత్కరించారు.

అలరించిన 'పాడుతా తీయగా'

ఏలూరు (టూటౌన్): స్థానిక వైఎంహెచ్‌ఏ హాలులో ఆదివారం పాడుతా తీయగా పిల్లల కార్యక్రమాన్ని నిర్వహించారు. 22 ఏళ్లుగా సంగీత సేవలో ఎందరో శిష్యులను కళాకారులుగా తీర్చిదిద్దిన ఎస్పీఎస్ మ్యూజిక్ అకాడమీ వ్యవస్థాపకుడు ఎస్పీఎస్ వాసు నిర్వహణలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ముందుగా ఎస్పీఎస్ దీప్‌చంద్ ప్రార్థన గీతంతో ఈ కార్యక్రమం ప్రారంభమైంది. 12 మంది చిన్నారులు పలు గీతాలు ఆలపించి అలరించారు. ప్రముఖ నేపథ్య గాయని ఐశ్వర్య న్యాయ నిర్ణేతగా వ్యవహరించారు. డాక్టర్ లంకా వెంకటేశ్వర్లు, మానవత నాగేశ్వరరావు, వాసును అభినందించారు.

ముగిసిన శరన్నవరాత్రి ఉత్సవాలు


గణపవరంలో కంచికామాక్షి, కనకదుర్గమ్మ


నిడమర్రు: మండలపర్రు పంచాయతన క్షేత్రంలో రాజరాజేశ్వరి అలంకరణలో ఉమాదేవి


భీమడోలు: గుండుగొలనులో రాజరాజేశ్వరి దేవిగా భ్రమరాంబికా మల్లేశ్వర స్వామి


భీమడోలు: గణపతి సెంటర్‌లోని అమ్మవారిని ఊరేగిస్తున్న దృశ్యం

భీమడోలు: దసరా శరన్నవరాత్రి ఉత్సవాల ముగింపు కార్యక్రమాలు వైభవంగా నిర్వహించారు. ఉత్సవాలు ఆదివారంతో ముగిసాయి. భీమడోలు మండలంలోని గుండుగొలను, పూళ్ల, భీమడోలు, కురెళ్లగూడెం, నరెడ్లగూడెం, పోలసానిపల్లి తదితర గ్రామాల్లోని ఆలయాల్లో శనివారం అమ్మవారు రాజరాజేశ్వరి దేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. కురెళ్లగూడెంలో అమ్మవారిని ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు దర్శించుకుని పూజలు చేసారు. అమ్మవారి విగ్రహాల నిమజ్జనోత్సవాలు ఆదివారం ప్రారంభమయ్యాయి. భీమడోలులోని ఈతకోటవారివీధి రామా లయం వద్ద ఏర్పాటు చేసిన కనకదుర్గాదేవి గ్రామోత్సవం ఘనంగా నిర్వహించారు. శక్తి, కాంతారా వేషాలు, జోకర్ బొమ్మలు, తీన్మార్, సన్నాయి వాయి ద్యాలు, బాణసంచా, డీజేవాయిద్యాలమధ్య గ్రామోత్సవాలు ఘనంగా నిర్వహించారు.అమ్మవారిని వైఎస్సార్‌సీపీ నాయకులు, కాపు సంఘం అధ్యక్షుడు పసుపులేటి శ్రీనివాస్, కాపు సంఘం నాయకులు, ఉత్సవ కమిటీ సభ్యులు గ్రామోత్సవంలో పాల్గొని అమ్మవారికి దర్శించుకున్నారు. భీమడోలు గణపతి యూత్ ఆధ్వర్యంలో నిమజ్జనోత్సవం వైభవంగా నిర్వహించారు. గుండుగొలనులో దసరా సందర్భంగా శ్రీదేవి భూదేవి సమేత శ్రీవేంకటేశ్వర స్వామి ఆలయంలో విశేష పూజలు, అభిషేకాలు చేసారు.

వైభవంగా ఊరేగింపు

గణపవరం: విజయదశమిరోజున శనివారం అమ్మ వారి ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. అమ్మవార్లకు మహిషాసుర మర్దనిగా ప్రత్యేక అలంకరణలు చేసి, అమ్మవార్లకు పూజలుచేశారు. గణప వరం కంచికామాక్షి, కనకదుర్గ అమ్మవార్ల ఆలయం వద్ద శనివారం రాత్రి బాణసంచా కాల్చి అమ్మవారి తెప్పోత్సవం నిర్వహించారు. చినరామచంద్రపురంలోని కనకదుర్గ ఆలయం వద్ద నిప్పులగుండం నిర్వహించారు. కన్యకా పరమేశ్వరి వర్తకసంఘ భవనంలో విజయదశమిరోజున వాసవీ అమ్మవారికి ప్రత్యే క అలంకరణ, పూజలు నిర్వహించారు. బస్టాండువద్ద సలాదివారి వీధిలో, పిప్పర, సరిపల్లె కనకదుర్గ అమ్మవారి ఆలయాల వద్ద ప్రత్యేక పూజలు చేశారు. ఆదివారం గణపవరంలోని కంచికామాక్షి కనకదుర్గ అమ్మవార్లను భారీగా ఊరేగించారు.

గ్రామాల్లో ఊరేగింపు సందడి

ఉంగుటూరు: ఉంగుటూరు, వెల్లమిల్లి, బాదంపూడి, యర్రమళ్ల, నాచుగుంట, కొత్తగూడెం, చేబ్రో లు, కైకరం, గొల్లగూడెం, రాచూరు తదితర గ్రామా ల్లో దుర్గమ్మ విగ్రహాలతో ఊరేగింపు ఆదివారం ఘనంగా నిర్వహించారు. బాణసంచా కాల్పులు, డప్పువాయిద్యాల నడుమ ఊరేగింపు నిర్వహించారు. ఉంగుటూరు శివాలయంలో ప్రతిష్ఠించిన అమ్మవారిని గ్రామంలో ఉత్సవ కమిటీ చైర్మన్ నారాయణం హనుమంతురావు ఆధ్వర్యంలో ఘనంగా ఊరేగించారు. బండారు సింధు, ఉప సర్పంచి పాతూరి జగదీష్ పాల్గొన్నారు. కొత్తగూడెం, కాలవ అవతల పేట అమ్మవారిని కనుల వైభవంగా ఊరేగించారు.

ప్రత్యేక కుంకుమ పూజలు

నిడమర్రు: ఈనెల 3వ తేదీ నుంచి ప్రారంభించిన శరన్నవరాత్రి ఉత్సవాలు శనివారంతో ముగిసాయి. బువ్వనపల్లి, అడవికొలను, పత్తేపురం, పెదనింద్రకొలను, చానమిల్లి, తోకలపల్లి గ్రామాల్లో అమ్మ వారి వేదికల వద్ద ముగింపు సందర్భంగా ప్రత్యేక కుంకుమ పూజలు నిర్వహించారు. మందలపర్రు పంచాయతన క్షేత్రంలో అమ్మవారిని రాజరాజేశ్వరిగా అలంకరించి పూజలు చేశారు. ఆదివారం ఆయా గ్రామాల్లో పలువురు భక్తులు అమ్మవారికి బంధువుల సమక్షంలో నైవేద్యాలు సమర్పించారు.

భక్తి శ్రద్ధలతో గొంతానమ్మ ఉత్సవం


పోలసానిపల్లిలో నందీశ్వరుడిని ఊరేగిస్తున్న ఉత్సవ కమిటీ సభ్యులు, యువకులు

భీమడోలు: పోలసానిపల్లి హరిజనపేటలోని విజయ దశమిని పురస్కరించుకుని శనివారం గొంతానమ్మ ఉత్సవాన్ని భక్తులు భక్తి శ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో గ్రామ దేవత గొంతానమ్మవారికి నవరాత్రుల పూజలను ఏటా వైభవంగా నిర్వహిస్తున్నారు. విజయదశమి రోజున గ్రామస్తులు పెద్ద ఎత్తున నందీశ్వరునికి ప్రత్యేక పూజలు చేశారు. నైవేద్యాలను సమర్పించారు. వైఎస్సార్‌సీపీ ఎంపీటీసీ అంబటి దేవి ప్రసాద్ దంపతులు నందీశ్వరునికి పూజలు చేశారు. గ్రామం సుభిక్షంగా ఉండాలని వారంతా పూజలు చేశారు. అమ్మవారికి అభిషేక, పూజలు చేశారు. అనంతరం ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో యువకులు, గ్రామస్తులు, మహిళలు పెద్ద ఎత్తున నందీశ్వరుడిని వ్యాన్‌పై ఉంచి గ్రామంలో ఊరేగించి అనంతరం కాలువలో నిమజ్జనం చేశారు.